ప్రజాశక్తి
బుధవారం 20 మార్చి 2024 5 అనంతపురం



జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వహించిన బీటెక్ మూడవ సంవత్సరం ఫలితాలు విడుదల అయ్యాయి. ఒకటవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీటెక్ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్15), (ఆర్19) సప్లిమెంటరీ, బీటెక్ మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీటెక్ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ (చివరి అవకాశం), బీటెక్ మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ (చివరి అవకాశం) ఇచ్చిన పరీక్షా ఫలితాలు, ఎం.ఫార్మసీ మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎం.ఫార్మసీ మూడవ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ ఒకటవ సంవత్సరం (ఆర్17), ఫార్మాడీ రెండవ సంవత్సరం (ఆర్17), ఫార్మా.డీ మూడవ సంవత్సరం (ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ (పిబి) ఒకటవ సంవత్సరం (ఆర్17), ఫార్మా.డీ (పిబి) రెండవ సంవత్సరం (ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియ వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.



మల్లు స్వరాజ్యంకు నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దాం

సిపిఎం ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజల పక్షాన తుదిశ్వాస వరకు పోరాటం సాగించిన మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని రాజీవ్ కాలనీలో మంగళవారం నిర్వహించారు. రాజీవ్ కాలనీలో పేదలు వేసుకున్న గుడిసెలకు మల్లు స్వరాజ్యం నగర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి, సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ చిన్నప్పుడే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని తన ప్రాణాలను లెక్క చేయకుండా బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన ధీర వనతి మల్లు స్వరాజ్యం అన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత భూమికోసం, భుక్తి కోసం, బానిస విముక్తి కోసం సాయుధ తెలంగాణ పోరాటాన్ని జరిపి నిజాం నవాబును తరిమి కొట్టిన గొప్ప నాయకురాలన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం తాను మరణించేదాకా ఎర్రజెండా కోసం పోరాడిన వీరవనిత అన్నారు. మల్లు స్వరాజ్యం తన జీవిత మంతా పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పరితపించినారన్నారు. ఆమె స్ఫూర్తితో పేదల అభివృద్ధి కోసం పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ప్రకాష్, బాబు, వెంకట్ నారాయణ, వలీ, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, డేవిడ్, మురళి, రాజు, రవి, గీత, శంషాద్, లాలెమ్మ, మాబున్నీ, ఫక్రున్నీ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల నేపథ్యంలో నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాల్లో త్వరితగతిన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు-2024 కోసం కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల విషయమై సంబంధిత రిటర్నింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో పార్కింగ్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్స్ మ్యాప్స్ సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆర్ఒలు జి.వెంకటేష్, వి.శ్రీని వాసులు రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, కరుణ కుమారి, వసంతబాబు, వెన్నెల శీను పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 1903 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో జరుగుతున్న పదోతరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం నాడు హిందీ పరీక్షకు 1903 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు. రెగ్యులర్, ప్రయివేటు కలిపి 32,301 మంది హాజరుకావాల్సి ఉండగా హిందీ పరీక్షకు 1903 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు.

అర్ధరాత్రి విషాదం



ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన ఆంబులెన్స్ ముందు భాగం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆంబులెన్స్
- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు
- మరణించిన వ్యక్తిని తీసుకుని వస్తుండగా ప్రమాదం

శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలో సోమవారం అర్ధరాత్రి విషాద ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో మరణించిన వ్యక్తిని ఆంబులెన్స్‌లో ఇంటికి తీసుకుని వస్తుండగా అది ప్రమాదానికి గురై మరో ఇద్దరు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటన బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాధాన్ని నింపింది.

వార్త మెయిన్‌లో

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విరమణ

అనంతపురం కలెక్టరేట్ : శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కళ్యాణదుర్గం ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులు ఎట్టకేలకూ మంగళవారం సమ్మె విరమించారు. కోత విధించిన వేతనం రూ.3200 తిరిగి కార్మికుల ఖాతాల్లో జమ చేయడంతో సమ్మె విరమిస్తున్నట్లు కార్మికులు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఇటీవల కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ తమ వేతనంలో రూ.3200 కోత విధించాడన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను నిలదీయగా 'ఇచ్చేది ఇంతే.. ఇష్టమైతే చేయండి..లేకుంటే వెళ్లండి.. నేను వేరే కార్మికులను తీసుకొచ్చి పని చేయించుకుంటా..' అంటూ కాంట్రాక్టర్ బెదిరించాడు. దీంతో ఎస్ఇ, డిఇతోపాటు పలువురు అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ఈనేపథ్యంలో కార్మికులం అంతా ఏకతాటిపైకి వచ్చి పూర్తిస్థాయి వేతనాలు చెల్లించే వరకూ పని చేయబోమని సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళ్లామన్నారు. చేసేదిలేక కాంట్రాక్టర్ దిగొచ్చి తమ వేతనాలను చెల్లించాడన్నారు. దీంతో సమ్మె విరమించి విధుల్లోకి చేరినట్లు తెలిపారు.



సీజ్ చేసిన ప్లాస్టిక్ బాటిళ్ల ఫ్యాక్టరీ

ప్లాస్టిక్ బాటిల్ తయారీ ఫ్యాక్టరీ సీజ్

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని వాల్మీకి నగర్ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాస్టిక్ బాటిళ్లు తయారు చేసే ఫ్యాక్టరీని సీజ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ తెలిపారు. పట్టణ పొలిమేరలోని ఒక గోదాములో ప్లాస్టిక్ బాటిళ్లను తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఫ్యాక్టరీని నడుపుతున్నట్లు విచారణలో తేలడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రచారంలో నిమగ్నం..!



- అభ్యర్థులు ప్రకటించిన చోట జనం వద్దకు నేతలు
- అన్ని స్థానాలకూ వైసిపి ప్రకటన
- ఇంకా రెండు స్థానాలు తేల్చని టిడిపి
- ఎన్నికల పనుల్లో అధికారులు బిజీబిజీ

జిల్లాలో ఎన్నికల హడావుడి ఊపందుకుంటోంది. ఇంతకాలం నోటిఫికేషన్ కోసం ఎదురు చూసిన నాయకులకు అది రావడంతో ఇక తదుపరి కార్యక్రమాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా ప్రచారంపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రకటించిన చోట ప్రచారాల వేగం పెరిగింది. అధికార వైసిపి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించేసింది. టిడిపి రెండు స్థానాలు మినహా మిగతా వాటికి అభ్యర్థులను ప్రకటించి వారిని ప్రచారం చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపరం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ఈసారి బరిలో ప్రధాన పార్టీల నుంచి హేమాహేమీలు పోటీలో నిలుస్తున్నారు. అన్ని శాసన సభ స్థానాల్లోనే నువ్వానేనా అన్నట్లు పోటీ ఉంది. ఈ పోటీ నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమిగ్నం అయ్యారు. ఇప్పటికే అధికార పార్టీ గత నెలలో సిద్ధం పేరుతో రాప్తాడు వద్ద భారీ బహింగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హాజరై వైసిపి శ్రేణులకు ఎన్నికలపై దిశానిర్దేశం చేసి వెళ్లారు. ఎన్నికల సంగ్రామం మొదలైందని గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పని చేయాలని చెప్పి వెళ్లారు. ఆ తరువాత ఆ పార్టీ అభ్యర్థుల ప్రకటన జరిగింది. అభ్యర్థుల ప్రకటన రావాడంతో అందరూ ప్రచారంలో మునిగిపోయారు. ఇక ప్రతిపక్ష టిడిపి కూడా ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని అస్త్రశస్త్రాలతో ప్రచారాలను చేస్తోంది. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పెనుకొండ రా..కదిలిరా పేరుతో బహిరంగ సభను నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల టిడిపి నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సభ నుంచే ఆయన వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని అభ్యర్థులకు సూచించి వెళ్లారు. గత వారంలో నాలుగు రోజుల పాటు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం పేరుతో పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. అభ్యర్థులు ఖారారైన స్థానాల్లో ఆయన పర్యటించి నేతలకు దిశానిర్ధేశం చేశారు. గత నెలలో నిజం గెలవాలి పేరుతో నారా భువనేశ్వరి కూడా పలు నియోజకవర్గాల్లో పర్యటించి టిడిపి శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసి వెళ్లారు.

ఆ రెండింటిపై టిడిపిలో వీడని సస్పెన్స్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా టిడిపి ఇప్పటికే 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక మూడు స్థానాలు మిగిలి ఉన్నాయి. వీటిలో ధర్మవరం నియోజకవర్గానికి బిజెపికి కేటాయించినట్లు ప్రచారం సాగుతోంది. మిగిలిన అనంతపురం, గుంతకల్లు స్థానాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. ఇది కూడా మరో రెండు మూడు రోజుల్లో ఫైనల్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అధికారులు బిజీబిజీ

ఎన్నికల నగరా మోగడంతో అధికారులు బిజీబిజీ అయ్యారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమిగ్నం అయ్యారు. కలెక్టర్, ఇతర ఎన్నికల అధికారులు అందరూ కూడా పూర్తి స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పరిశీలన చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ హాల్, ఈవీఎంలను నిరంతరం పరిశీలిస్తున్నారు. ఎన్నికల సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి వారికి తగిన మార్గదర్శకాలు ఇస్తున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లును చేస్తున్నారు. మొత్తం మీద అభ్యర్థులు ప్రచారం పనుల్లో నిమగ్నం అయ్యి ఉండగా, అధికారులు ఎన్నికల నిర్వహణ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

'అమ్మా.. నన్ను కిడ్నాప్ చేశారు'..!

- తల్లిదండ్రులు కొడతారన్న భయంతో బాలుని డ్రామా
- కిడ్నాప్ కాదని తేలడంతో ఊపిరిపీల్చుకున్న జనం



బాలున్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులో తొమ్మిదేళ్ల బాలుడు కిడ్నాప్ కలకలం రేగింది. బాలున్ని ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో జనంలో అలజరడి రేగింది. అయితే ఇది కిడ్నాప్ కాదని బాలుడు ఆడిన నాటకం అని పోలీసులు తేల్చారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పెద్దవడుగూరు మండల కేంద్రంలో ఓబుల్‌రాజు, మాధవి దంపతులు ఓ ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్నారు. వీరి కుమారుడు మహేష్ పెద్దవడుగూరు సరస్వతి ప్రయివేటు స్కూల్లో మూడో తరగతి చదువుతున్నాడు. పెన్సిల్ తెచ్చుకుంటానని చెప్పి మంగళవారం ఉదయం 9 గంటలకు వారి దుకాణం నుంచి బయటికెళ్లాడు. చాలాసేపు అయినా బాలుడు ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు. ఈ క్రమంలో 10-30గంటల సమయంలో బాలుడు ఇంటికి వచ్చాడు. ఎక్కడికి వెళ్లావని తల్లిదండ్రుల ప్రశ్నించగా తనను ఎవరో ద్విచక్రవాహనంలో ఎత్తుకెళ్లారని తెలిపాడు. ఇద్దరు వ్యక్తులు పల్సర్ బండిలో కిడ్నాప్ చేసి పెద్దవడుగూరు నుంచి మిడుతూరు మీదుగా తీసుకెళ్లారని, మిడుతూరు వద్ద తనకు వాంతులు కావడంతో అక్కడ వదిలి వెళ్లిపోయారని చెప్పారు. అక్కడున్న ఓ పెద్దాయన తనను పెద్దవడుగూరు వైపునకు వచ్చే ఓ వ్యక్తి ద్విచక్రవాహనం ఎక్కించి పంపాడని తెలిపాడు. దీంతో తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఈ విషయాన్ని తెలియజేశారు. ఘటనపై స్పందించిన పెద్దవడుగూరు ఎస్ఐ ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. మరోవైపు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా వివరాలు సేకరించారు. బాలుడు మహేష్ తనంతట తానుగా ఉదయం 9-18గంటలకు పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ మీదుగా నడుచుకుంటూ వెళ్లాడు. తిరిగి 10:30 గంటలకు అదే దారిలో వారి ఇంటికి చేరుకున్నాడు. బాలుడు చెబుతున్న మాటలకు సీసీ టీవీ పుటేజీలో దృశ్యాలకు పొంతన లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. బాలునితో ప్రత్యేకంగా మాట్లాడడంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఆలస్యంగా ఇంటికి వచ్చిన తనను తల్లిదండ్రులు కొడతారన్న భయంతో అపద్దపు డ్రామా ఆడానంటూ బాలుడు చెప్పడంతో ఆసలు విషయం బయటకు వచ్చింది. దీంతో పోలీసులు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి బాలున్ని వారికి అప్పగించారు.



మృతి చెందిన గొర్రెలు

జొన్న ఇగురు తిని 80 గొర్రెలు మృతి

రూ.10.50 లక్షలు నష్టం

ప్రజాశక్తి-బెలుగుప్ప

జొన్న ఇగురుతిని 80 గొర్రెలు మతి చెందిన సంఘటన మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపాన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గొర్రెల యజమాని తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కందూకూరు మండలం పి.వెంకటంపల్లి తండాకు చెందిన లాల్య నాయక్ మేత నిమిత్తం గొర్రెల మందను బళ్లారి ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ మేత అనంతరం సోమవారం నాడు స్వగ్రామం తిరుగు ప్రయాణం అయ్యాడు. చీకటి పడడంతో బెలుగుప్ప మండలం గంగవరం గ్రామ సమీపంలో రాత్రి గొర్రెల మందతో కలిసి నిద్రించారు. వీరు నిద్రించిన ప్రాంతంలో ఓ పొలంలో ఎండిన జొన్నను దున్నేశారు. ఈ జొన్న ఇగురును గొర్రెలు తిన్నాయి. తిన్న వెంటనే 49 గొర్రెలు ఘటనా స్థలంలోనే మరణించాయి. ఇది గమనించిన గొర్రెల కాపరి పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు సమాచారం అందించారు. వారు మంగళవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే మరో 31 గొర్రెలు మతి చెందాయి. మొత్తం 80 గొర్రెలు మతి చెందడంతో దాదాపు రూ.10.50 లక్షలు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి కన్నీటి పర్యవంతం అయ్యాడు. గొర్రెల మృతి విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయసంచాకులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్ ఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మతి చెందిన గొర్రెలకు శవపరీక్ష నిర్వహించారు. బెలుగుప్ప మండల ఎంపిపి పెద్దన్న, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, కురువ సంఘం కళ్యాణదుర్గం అధ్యక్షుడు దొరస్వామి తదితరులు గొర్రెల కాపరిని పరామర్శించి ఓదార్చారు. కాపరిని ఆదుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉరవకొండ కాంగ్రెస్ టికెట్ ఎవరికి?

ఆరుగురు దరఖాస్తు-రేసులో ముగ్గురు..



వై.మధుసూదన్‌రెడ్డి | రవికృపరామానాయుడు | బ్యాళ్ల ప్రసాద్

ప్రజాశక్తి-ఉరవకొండ

రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికీ వస్తుందో.. ఆ పార్టీ నియోజకవర్గ శ్రేణులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి ఆరుగురు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అయితే వీరిలో రవికృప రామా నాయుడు, వై.మధుసూదన్‌రెడ్డి, బ్యాళ్ల శివప్రసాద్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. 2019లో కూడేరు మండలానికి చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన పొడపాటి రామానాయుడు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 2394 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే అప్పట్లో ఈయన స్థానికంగా లేకపోవడం.. పార్టీ కార్యక్రమాల పట్ల దృష్టి సరించకపోవడం కారణంగానే మరీ దారుణంగా ఓడిపోయారన్న విమర్శలు వినిపించాయి. ఇకపోతే ఈసారి మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త వై.విశ్వేశ్వరరెడ్డి సోదరుడు వై.మధుసూదన్‌రెడ్డి ఇటీవలే వైసిపి నుంచి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్వయానా ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. మరోవైపు కురుబ సామాజిక వర్గానికి చెందిన నవతరం నాయకుడు బ్యాళ్ల శివప్రసాద్ సైతం అధికార పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శివప్రసాద్ యువకుడు..ఉరవకొండ పట్టణంలోనే నివాసం ఉంటూ అందరికీ అందుబాటులో ఉంటున్నాడు. అంతేగాకుండా పార్టీ చేరినప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనదైన శైలిలో నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పోతున్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ సీనియర్ నేతలకా.. యువ నాయకులకా.. అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏదిఏమైై ముగ్గురిలో రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం ఎవరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యక్తలు ఎదురుచూస్తున్నారు.

వైభవంగా చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు, పాల్గొన్న పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రసిద్ధిచెందిన గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం మంగళవారం వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రథం అలంకరణకు పూలను స్థానిక కార్యాలయం నుంచి పురవీధుల గుండా మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర మహాస్వాములు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై కొలువు తీర్చారు. సంప్రదాయబద్ధంగా, శాస్త్రక్తంగా పూజలు చేసిన అనంతరం అశేష జనవాహిని చేసిన శివనామస్మరణ మధ్య చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం కమనీయంగా సాగింది. వేలాది మంది భక్తులు తరలివచ్చి రథంపై పూలు, పండ్లు విసిరి తమ మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం ముందు మఠం ఏనుగు ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో చంద్రమౌళీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నుంచి కాకుండా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కాగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, వైసిపి సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకుని మఠం అధికారులు చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గవిమఠం ఉత్తరాధికారి బసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకీమట్టం పీఠాధిపతి కళ్యాణిస్వామి, గవిమఠం అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటి బిడ్డను ఆదరించండి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ


మహిళలతో మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

'మీ ఇంటి ఆడబిడ్డను.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడుతున్నా.. ఆదరించండి.. అంటూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని రోటరీపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, పర్వతనేని శ్రీధర్‌బాబు పసుపుల హనుమంతురెడ్డి, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, మండల కన్వీనర్ అశోక్‌కుమార్, మల్లేష్, సోము, పొడరాళ్ల రవీంద్ర, సాకే లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి : వైసిపి


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

టిడిపి నాయకులు ఏ గ్రామానికి వెళ్లినా వైసిపి చేసిన అభివృద్ధి కనిపిస్తుందని ఎంపిపిల జిల్లా సంఘం అధ్యక్షులు పెద్దన్న, వాల్మీకి సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు, వైసిపి మండల అధ్యక్షుడు చిన్న మచ్చన్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రకటించిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అవినీతి రహితంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. మండలంలోని ప్రతిగ్రామంలో నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ఎంతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అలాగే సచివాలయాలు, ఆర్‌బికెలు, మినీ హెల్త్‌క్లినిక్‌లు, గ్రామాలకు రోడ్డు వంటికి చేశామన్నారు. ఇవన్నీ ఏ గ్రామానికి వెళ్లినా కనిపిస్తాయన్నారు. వీటిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలిచి ఐదేళ్లు అయినా ఒక్కసారైనా బెలుగుప్ప మండల ప్రజలను పట్టించుకున్నారా.. అని నిలదీశారు. తమ నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి నిరంతరం ప్రజలో ఉండి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించారన్నారు. అలాంటి వ్యక్తిపై మీరు విమర్శలు చేసే అర్హత టిడిపి నాయకులకు లేదన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు బురద చల్లడం మానుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసులు, బి.శివలింగప్ప, పురుషోత్తం, రాజు, నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, కరుణాకర్, పాతన్న, తిమ్మారెడ్డి, చెక్కే తిప్పేస్వామి, నరిగన్న, ఎర్రిస్వామి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల : మండల పరిధిలోని తరిమెల గ్రామానికి చెందిన సుశీల, నాగప్ప కుమారుడు నాగరాజు వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, బెస్త నారాయణస్వామి, ప్రసాద్‌నాయక్, దండు ప్రకాష్, పుల్లయ్య, రామదాసు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT AND SESSIONS JUDGE, ANANTHAPURAMU.
CRL.REVISION NO: 28/2023

Between:-
P.Chandra Sekhar Reddy
...Revision Petitioner
And
Akshinthala Raghavendra Prasad
...Respondent/Accused

Notice To Respondent/Accused

To:
Akshinthala Raghavendra Prasad, Major, Hindu, D.No:12-2-360, Ground Floor, Anandam Apartments, Hari Hara Temple Line, Ashok Nagar, Ananthapuramu.

పై నెంబరు దావాలోని రెస్పాండెంట్/ముద్దాయి అయిన మీరు చెక్‌బోన్స్ కేసులో బాకీ మొత్తం Rs:40,000/- రాబట్టు కొనుటకై ఎన్ని సార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయడం జరిగినది.కావున మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 25/03/2024 వ తేది నాడు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమునందు తీర్మానించబడును అని మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

PALEM VARADARAJULU,
Advocate for the Revision Petitioner
Ananthapuramu, Cell:9441215812

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE, ANANTHAPURAMU.
E.P. NO:505/2023 in A.A. NO: 05/2022

Between:-
M/s Shriram Finance Limited formerly know as Shriram City Union Finance Limited Amalgamated With Shriram Transport Finance Ltd. and Converted as Shriram Finance Ltd, Branch-2 Vidyuth Nagar, Ananthapuramu Rep by its Anthorized Signatory B.Chandra Sekhar
...D.Hr
And
G.Nagaraju and another **...J.Drs**

Notice To J.Dr No:1

J.Dr No:1:G.Nagaraju S/o G.Hanumanthu R/of D.No:27-703, Ambedkar Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో 1వ J.Dr అయిన మీ హాజరు నిమిత్తము 22-03-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

జె.ఎల్.నరసింహులు, అడ్వకేటు, అనంతపురం

ఇంటి డాక్యుమెంట్ పోయినది

గుత్తి పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన కొలిమి **మహబూబ్ బాషా కుమారుడైన కొలిమి షబ్బీర్‌కు** సంబంధించిన ఇంటి లింక్ **(4624/2019) ఒరిజినల్ డాక్యుమెంట్** తీసుకొని జిరాక్స్ చేయించడానికి తీసుకెళ్తుండగా పోయినది. దొరికిన వారు వెంటనే **9553921090** నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

ఐదేళ్ల బాలుడికి 'బెలూన్ యాంజియోప్లాస్టీ'

'అనంత'లో తొలిసారి చికిత్స-కిమ్స్ సవీరా వైద్యులు మూడే సందీప్



చికిత్స వివరాలను వెల్లడిస్తున్న సవీరా వైద్యుడు మూడే సందీప్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోనే మొట్ట మొదటి సారిగా ఐదేళ్ల బాలుడికి యాంజియోప్లాస్టీ చేసిన ఘటన అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి చోటు చేసుకుంది. చికిత్స వివరాలను కిమ్స్ సవీరా ఆస్పత్రికి చెందిన సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ వివరించారు. జిల్లాలోని కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలుడు జీవన్ చాలా త్వరగా అలసిపోతుండటంతో పాఠశాలలో ఆటలు సరిగ్గా ఆడుకోలేకపోతున్నాడని తల్లిదండ్రులు తొలుత ఆర్డీటీ ఆస్పత్రిలో చూపించారు. అక్కడ సమస్యను గుర్తించిన వైద్యులు వెంటనే కిమ్స్ సవీరా ఆస్పత్రికి సిఫారసు చేశారన్నారు. సవీరాలో పరీక్షించి పిల్లాడి కాళ్లకు రక్త సరఫరా చాలా తక్కువగా ఉండటంతోపాటు చేతులకు మాత్రం చాలా ఎక్కువగా ఉంటోందని గుర్తించి 2డి ఎకో, సీటీ స్కాన్ లాంటి పరీక్షలు చేశామన్నారు. బృహద్ధమని మడత పడిపోయి, రక్తసరఫరా నిలిచిపోయినట్లు తెలిసింది. దీన్ని వైద్య పరిభాషలో కార్క్టేషన్ ఆఫ్ అయోర్టా అంటారు. ఇది సాధారణ పిల్లల్లో 0.06 శాతం నుంచి 0.08 శాతం మందికే వచ్చే అత్యంత అరుదైన సమస్య అన్నారు. అదే పుట్టుకతోనే గుండె సమస్య ఉన్న పిల్లల్లో అయితే ఇది 6 నుంచి 8 శాతం మందికి వస్తుందన్నారు. సమస్య తీవ్రంగా ఉండటంతో బాలుడికి బెలూన్ యాంజియోప్లాస్టీ చేయాలని నిర్ణయించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేశామన్నారు. తమ కుమారుడికి ఇన్నాళ్లుగా ఉన్న సమస్యను కేవలం కొద్ది గంటల్లోనే దూరం చేసినందుకు జీవన్ తల్లిదండ్రులు కిమ్స్ సవీరా ఆస్పత్రి యాజమాన్యానికి, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లిములకు వైసిపి పెద్దపీట : ఎమ్మెల్యే వైవిఆర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో ప్రతి ముస్లిం మైనార్టీ కుటుంబానికీ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూర్చిందన్నారు. ముఖ్యంగా గుంతకల్లు నియోజకవర్గంలో షాదీఖానాలు, కబరస్థాన్లను నిర్మించామన్నారు. ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. అంతేగాకుండా సార్వత్రిక ఎన్నికల్లో సిఎం జగన్ ముస్లిం మైనార్టీలకు ఏడు సీట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి జగనన్నను సీఎంగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, ఖాజీ అబ్దుల్ హై, ముల్లా రషీద్, ముల్లా మహబూబ్ బాషా, జిఎం.బాషా, కోనా మురళీధర్‌రెడ్డి, క్రషర్ మధుసూదన్‌రెడ్డి, బి.రాజకుమార్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, గురుప్రసాద్ యాదవ్, సివి.రంగారెడ్డి, కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎన్.ఫారూఖ్, నజీర్, వి.వరద, మార్తాడు అన్సర్, దస్తగిరి, సుంకం రఫీ, డిష్ అన్వర్, నూర్‌నాయక్, కటిక అన్వర్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులను అందజేస్తున్న నిర్మలమురళి

బాలింతకు ఆర్థికసాయం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి కళ్యాణదుర్గ రోడ్డు బాలాజీ విల్లాస్ సమీపంలో నివాసం ఉంటున్న పేద బాలింతరాలు నాగరత్నకు ఆర్థికసాయం అందజేశారు. ఇందులో భాగంగా ట్రస్టు సభ్యులు సౌజన్య, హరినాథ్‌రెడ్డి సహకారంతో రెండు నెలలకు సరిపడా 25 రకాల సరుకులు రూ.5వేల నగదు, చిన్నారి పేరిట రూ.12వేల డిపాజిట్ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

ఆర్‌జెడికి ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ముందస్తుగా అడ్మిషన్లు చేపట్టిన ఎడిఫై వరల్డ్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్‌జెడి రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తికాక మునుపే కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపట్టాయన్నారు. ఇందులో భాగంగానే నగరంలో పెద్ద పెద్ద హోర్డింగులపై ఎడిఫై వరల్డ్ స్కూల్ అడ్మిషన్ ప్రారంభం అంటూ పెద్దఎత్తున ప్రచారాలు చేపట్టిందన్నారు. వెంటనే సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బీమా చెక్కు అందజేత


బాధితురాలికి బీమా చెక్కు అందజేస్తున్న ఎపిజిబి మేనేజర్ నరసింహులు

పెద్దపప్పూరు : ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద మంజూరైన బీమా మొత్తాన్ని మండల కేంద్రంలోని ఎపిజిబి మేనేజర్ నరసింహులు మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఇటీవల తొండూరి ఈశ్వరయ్య గుండె పోటుతో మృతిచెందాడు. ఈయన గతంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి పథకం కింద సంవత్సరానికి రూ.436 చెల్లించేవారు. ఈనేపథ్యంలో ఆయన మృతిచెందడంతో మంజూరైన బీమా రూ.2లక్షల చెక్కును మృతుడు భార్య రాజేశ్వరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం : ఇఆర్‌ఒ



ర్యాలీలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారి రాణి సుస్మిత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రతి పౌరునికీ ఓటుహక్కు వజ్రాయుధమని, అలాంటి ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రాణీసుస్మిత సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఓటుహక్కుపై ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి పౌరుడు ఓటు వేసి సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ

కంబదూరు సమీపంలో ఏర్పాటు చేసిన కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పకడ్బందీగా వాహనాల తనిఖీ చేపట్టి డబ్బు, మద్యం సరఫరాకు అడ్డుకట్ట వేయాలన్నారు. రికార్డులను పరిశీలించిన తర్వాతే వాహనాలను అనుమతించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గంగయ్య

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని గార్లదిన్నె, బొందలదిన్నె, చిన్నయక్కలూరు, పెద్ద యక్కలూరు, దేవుని ఉప్పలపాడు, చెర్లోపల్లె, తురకపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ గంగయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల్లో వెలుతురు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అలాకాకుండా గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌చంద్ర, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నార్పల

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపిడిఒ రాముడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేసేపల్లి సచివాలయ ఆవరణలో 'ఆరోగ్య సురక్ష' మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అన్నారు. కార్పొరేటు వైద్యానికి దీటుగా వైద్యులే ప్రజల వద్దకు వచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా మండల పరిధిలోని కురుగానపల్లి పాఠశాలను ఎంపిడిఒ సందర్శించారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. సౌకర్యాలు వంటి వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, పప్పూరు ప్రాథమిక వైద్యశాల డాక్టర్లు మహేంద్ర, జాహిర, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపిహెచ్ఇఒ మల్లికార్జున, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన గేట్స్ కళాశాల విద్యార్థులు

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన జేఎల్ కంపెనీ క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించగా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, ఎంసీఏ చదువుతున్న 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారు జెల్ కంపెనీలో జావా ఫుల్ స్టాక్ డెవలపర్స్ గా పని చేస్తారని రూ.3.5 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు సుఫియాన్, షాహిద్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ,ఎండి జి.రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్ అభినందించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో 'గడప గడపకూ మెట్టు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా వైసిపికి ఓటు వేసి జగనన్నను మరోసారి సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు హరిజనలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బోయ మల్లికార్జున, ఎంపిటిసిలు మహేష్, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, మండల బీసీ సెల్ అధ్యక్షులు చంద్ర, నాయకులు రహంతుల్లా, జగదీష్, ఎర్రిస్వామి, తొండే వెంకటేష్, నాగ, ఖాసీంపీరా, తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

గుత్తి : సచివాలయ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్న గుత్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుపై చర్యలు తీసుకోలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గుడి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు నెలలుగా సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లకు సకాలంలో వేతనాలు రాకుండా కమిషనర్ అడ్డుకుంటూ వేధిస్తున్నారన్నారు. నిత్యం ఉద్యోగులకు టార్గెట్లు విధిస్తూ సెలవు రోజుల్లో కూడా పనిచేయిస్తూ చేయకపోతే సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. వారంలో 50 మంది సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేశారన్నారు. మెమోలు, సస్పెండ్ పేరుతో మానసికంగా వేధిస్తున్నారన్నారు. మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా వ్యాఖ్యనిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే కమిషనర్‌పై చర్యలను చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రూరల్ డీఎస్పీ వెంకట-శివారెడ్డి

ఘర్షణ కేసులో నిందితులకు రిమాండ్

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో ఈనెల 16వతేదీన జరిగిన ఘర్షణ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు మంగళవారం అనంతపురంలోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకట శివారెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 16న గూగూడులో బోయ కులస్తులు, ఎస్సీ కులస్తుల మధ్య పొలంలో కరెంటు స్తంభం విషయంలో వివాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బోయ కులస్తులు రాజన్న, నరసింహులు కలిసి ఎస్సీలు నల్లప్ప, రామాంజనేయులుపై దాడి చేసి గాయపరచడంతోపాటు మోటార్ సైకిల్‌ను తగులబెట్టారు. ఈనేపథ్యంలో మంగళవారం మండలంలోని మడుగుపల్లి క్రాస్ వద్ద నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కారు బోల్తా..ఇద్దరికి గాయాలు


బోల్తా పడిన కారు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో మంగళవారం కారు బోల్తా పడింది. దీంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. జక్కలచెరువు గ్రామానికి చెందిన సురేష్, సంజీవ కలిసి స్వగ్రామం నుంచి గుత్తికి కారులో బయలుదేరారు. అయితే కారు గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరూ గాయాలపాయ్యారు. కారు పాక్షికంగా దెబ్బతింది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి..


గాయపడిన మోక్షన్

గుత్తి : మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన పి.శివయ్య కుమారుడు పి.మోక్షన్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం గుత్తిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆ విద్యార్థికి కుడికాలు విరిగినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై విద్యార్థి తండ్రి శివయ్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం 75 వీరాపురం గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయచంద్ర, కళానాయక్ మహిళా సంఘసభ్యులు, యానిమేటర్ బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

బెలుగుప్ప : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ తనయుడు విజయసింహ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అంకంపల్లి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఈ సమయంలో వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవాసంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ సమీపంలోని అనంతపురం-బళ్లారి బైపాస్ సమీపంలో వెంకటేశ్వర బ్యాంబు డిపో వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ మాట్లాడుతూ తన సొంత నిధులు వెచ్చించి సమాజసేవలో భాగస్వామి కావాలనే సదుద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవాసంఘం నియోజకవర్గ అధ్యక్షులు సాకే వసంత్, ప్రధాన కార్యదర్శి సాకే పురుషోత్తం, పట్టణ అధ్యక్షులు ఎరుకుల వీరేంద్ర, హనుమంతు, ఎన్.సుబ్బరాయుడు, ఎరుకుల గోవిందు, సుంకన్న, దుర్గన్న, రవి, పులివెందుల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు రేషన్ డీలర్ల సస్పెన్షన్

రాయదుర్గం : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాయదుర్గానికి చెందిన నలుగురు చౌక దుకాణపు డీలర్లను సస్పెండ్ చేసినట్లు రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన రేషన్ డీలర్లు వంశీకృష్ణ, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, ఒక నామినేటెడ్ డీలర్ రఫిక్ కలిసి వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు రావడంతో కళ్యాణదుర్గం ఆర్డీవో రాణి సుస్మిత, మరియు రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కరుణకుమారి విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రచారంలో వారు పాల్గొనట్లు వెల్లడికావడంతో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

వాలంటీర్ కూడా..

పట్టణంలోని 14వ సచివాలయానికి సంబంధించిన వార్డు వాలంటీర్ జె.రవిని ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.కిషోర్ తెలిపారు. ఎన్నికల వార్డులో వైసిపి అభ్యర్థి తరపున రవి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదు రాగా విచారించిన అనంతరం నిజమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి : ఎస్పీ


మాట్లాడుతన్న ఎస్పీ

అనంతపురం క్రైం : త్వరలో జరగనున్న ఎన్నికల్లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని ఎలెక్షన్ వింగ్స్ సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. ఎన్నికల కోసం ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఎలెక్షన్ వింగ్స్‌తో మంగళవారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్, సెబ్, ఏ.ఆర్, సైబర్, ఐ.టి.కోర్, తదితర విభాగాల అధికారులు వారికి కేటాయించిన విధులను పక్కాగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఏం చేయాలో దిశానిర్దేశం చేశారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీ ఎం.ఆంథోనప్ప, సిఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, షేక్ జాకీర్, విశ్వనాథచౌదరి, సంజీవకుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

పుట్లూరు : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో సిఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహినంచారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని శనగల గూడూరు, పుట్లూరు, మడుగుపల్లి, కడవకల్లు, కొండాపురం గ్రామాల్లో బిఎస్ఎఫ్, సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు కవాతు నిర్వహించి ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేమాద్రి, పుట్లూరు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.